సింగిల్ పేజీ కథ -కె.బి.కృష్ణ

# శాంతి

-కె.బి.కృష్ణ
అకౌంట్స్ ఆఫీసర్
(ఆర్ అండ్ బి) స్పెషల్ ఎ.డి.బి.సర్కిల్
కాకినాడ - 533 004.

వివాహం అనేది భగవంతుడు ఏర్పాటు చేసిన ఒక దివ్యమైన స్త్రీ పురుషుల కలయిక.

అది నేటి సమాజంలో వ్యాపారమయింది. కారణం "ధన మూలం ఇదం జగత్" డబ్బుకోసం గడ్డితినే రోజులు.

శాంతి నల్లగా ఉంటుంది.

అలాగని అందవికారంగా ఉండదు.

...ఐదున్నర అడుగుల ఎత్తులో, వడ్డాది పాపయ్య గారి చిత్రాలలో స్త్రీ మూర్తులలాగా వయసు పొంగులతో మగాళ్ళను పిచ్చెక్కించే రూపం ఆమెది. ఆమె ధనవంతుల ఇంట్లో పుట్టింది కాబట్టి, ఈ మధ్యనే భర్తను కొన్ని లక్షలు పోసి కొనుక్కుంది. లక్షలకు తగ్గట్టుగా లెక్కలేనన్ని కానుకలూ వగైరాలు శాంతి వెంబడే నడుచుకుంటూ భర్త కుమార్ ఇంటికి వచ్చేశాయి. కుమార్‌కి తండ్రిలేడు. తల్లిచాటు బిడ్డడు.

ఆడాళ్ళు తెల్లగా ఉంటే అందంగా ఉంటారని మగాళ్ళకు పిచ్చి నమ్మకం. కాని నల్లగా ఉన్న స్త్రీలో ఉన్న కళ తెల్లగా ఉన్న వాళ్ళల్లో ఉండదని కొంత మంది మగాళ్ళకు తెలియదు. ఈ సత్యం కుమార్ తెలుసుకున్నాడు.

ఒకనెల రోజులు శాంతితో సహజీవనం సాగించేడు.

ఒకరోజు రాత్రి, శాంతి తన భర్త కుమార్‌తో మర్నాడు నాగార్జునసాగర్‌కి మినీ హనీమూన్ వెళ్ళడం గురించి అక్కడ నుండి విజయవిహార్ ఎ.సి.రూమ్‌లో అనుభవించే మధుర సుఖాలు కలలుగా కంటూంది.

ఈలోగా...

తన భర్త, అత్తగారి మాటలు వినిపిస్తూంటే తలుపుచాటుగా నిలబడి వినసాగింది శాంతి.

"పిచ్చి వెధవాయ్. నల్ల ముం..ని తొందరగా వదిలించుకోరా. నాగార్జునకొండకి లాంచీ మీద వెళ్ళండి. దారిలో కృష్ణలోకి తోసేయ్. జారిపడి పోయిందని ఏడుద్దాము. తర్వాత కార్యక్రమం మామూలే. మళ్ళీ నీకు మంచి కట్నంతో పెళ్ళి చేస్తాను" అత్తగారి మాటలు.

"అమ్మా, పాపం శాంతి మంచిదే, పైగా నల్లగా ఉన్నాకూడా అందంగా ఉంటుందే" అంటున్నాడు తన భర్త.

"ఏడిశావ్ వెధవాయ్ వోర్నాయనోయ్. నీకు అది ఏదో మందుపెట్టింది రోయ్. నువ్వు సాగర్ నుంచి దీనితో తిరిగి వచ్చావంటే నన్ను చూడవు. నా శవాన్ని చూస్తావు" అంటోంది అత్తగారు.

శాంతికి తన ఎదురుగా ఉన్న ఫోటోలో తన భర్త తన పాలిట మృత్యుదేవతలా కనపడుతున్నాడు.

మర్నాడు.

తెల్లవారు జామున...

శాంతి అత్తగారు...

కిరసనాయిలుతో తడిచి ఉంది...

ఎదురుగా శక్తి స్వరూపిణిలాగా శాంతి!

"నన్ను చంపించి మళ్ళీ మీ అబ్బాయికి పెళ్ళి చేస్తారా! అలాగే... ముందు నిన్ను చంపి తర్వాత మా సంగతి చూసుకుంటాం" అంటూ చేతిలో అగ్గిపెట్టెతో నిలబడి ఉంది శాంతి.

"వద్దు తల్లీ. నన్ను ఇలా బ్రతకనియ్యి. నీ జోలికి రాను" అని ప్రాధేయపడుతూంది అత్తగారు.

ఈలోగా శాంతి భర్త కుమార్ వచ్చాడు.

....పరిస్థితి చూసి శాంతి దగ్గరకు వెళ్ళడానికి జంకుతున్నాడు కుమార్.

నిప్పుకణికల్లాంటి...

ఎర్రని కళ్ళతో...

చేతిలో అగ్గిపెట్టెతో...

కాళిక లాగా శాంతి.

'వద్దు శాంతి' అని ప్రాధేయపడుతున్నట్లుగా తన తల్లిని నిశ్చేష్టుడై చూస్తున్నాడు కుమార్.

శాంతి స్త్రీ జాతి కంతటికీ ప్రతినిధిలా, విశ్వరూపం ధరించిన భద్రకాళిలా ఉంది.

శాంతి...

మరి ఏం చేయాలనుకుంటుందో...★

